रजिस्ट्री सं. डी–२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య. డి–221

मूल्य रू. १५–००
Price Rs. 15-00
మూల్యము : రూ. 15–00

भारत का राजपत्र
The Gazette of India
భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १. | नई दिल्ली | गुरुवार | ७ नवंबर, २०२४ | अश्वयुजा | खंण्ड ३१ |
| No.1 | New Delhi | Thursday | 7 November, 2024 | Ashwayuja | Vol. 31 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | గురువారము | 7 నవంబరు, 2024 | ఆశ్వయుజ | సంపుటము 31 |


MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 11th October, 2024

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Telecom Regulatory Authority of India Act, 1997 [Act No.24 of 1997], (2) The National Investigation Agnecy Act, 2008 [Act No.34 of 2008], (3) The Rights of Persons with Disabilities Act, 2016 [Act No.49 of 2016], (4) The Indian Institutes of Management Act, 2017 [Act No.33 of 2017] are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

**శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ**

**(శాసన నిర్మాణ విభాగము)**

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) భారత టెలికాం క్రమబద్ధీకరణ ప్రాధికార సంస్థ చట్టము, 1997 (1997లోని 24వ చట్టము), (2) జాతీయ దర్యాప్తు ఏజెన్సీ చట్టము, 2008 (2008లోని 34వ చట్టము), (3) దివ్యాంగుల హక్కుల చట్టము, 2016 (2016లోని 49వ చట్టము), (4) భారతీయ సంస్థల నిర్వహణ చట్టము, 2017 (2017లోని 33వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# జాతీయ దర్యాప్తు ఏజెన్సీ చట్టము, 2008

## 2008లోని 34వ చట్టము

**(31 డిసెంబరు, 2008)**

**భారతదేశ సార్వభౌమత్వము, భద్రత మరియు అఖండత, రాజ్య భద్రత, విదేశ రాజ్యములతో స్నేహపూర్వక సంబంధాలకు భంగము కలిగించు అపరాధములను మరియు ఐక్య రాజ్యములు దాని ఏజెన్సీలు మరియు ఇతర అంతర్జాతీయ సంస్థల అంతర్జాతీయ సంధులు, కరారులు, సమావేశములు మరియు తీర్మానములను అమలుపరచుటకు చేసిన చట్టముల క్రింద అపరాధములను దర్యాప్తుచేసి మరియు అభియోగం నడుపుటకై (ప్రాసిక్యూట్ చేయుటకై) జాతీయ స్థాయిలో ఒక దర్యాప్తు ఏజెన్సీను ఏర్పాటు చేయుటకు మరియు వాటికి సంబంధించిన లేక ఆనుషంగికమైన విషయముల కొరకైన చట్టము.**

భారత గణ రాజ్యము యొక్క ఏబది తొమ్మిదవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము-I

## ప్రారంభిక

సంగ్రహనామము, విస్తరణ మరియు వర్తింపు.

1. (1) ఈ చట్టమును జాతీయ దర్యాప్తు ఏజెన్సీ చట్టము, 2008 అని పేర్కొనవచ్చును.

(2) ఇది భారతదేశమంతటికి విస్తరించును మరియు ఈ క్రింది వారికి కూడా వర్తించును-

(ఎ) భారతదేశం వెలుపల ఉన్న భారత పౌరులకు;

(బి) ప్రభుత్వ సర్వీసులో ఉన్న వ్యక్తులకు, వారెక్కడున్నప్పటికీ; [1][***]

(సి) భారతదేశములో రిజిస్టరు చేయబడిన ఓడలు మరియు విమానములలో ఉన్న వ్యక్తులకు, వారెక్కడున్నప్పటికీ; [2][మరియు]

[2][(డి) భారతదేశము వెలుపల ఉన్న భారత పౌరులకు లేదా భారతదేశ హితమునకు ప్రభావము కలుగజేయు ఒక అనుసూచిత అపరాధమును చేసిన ఎవరేని వ్యక్తులు.]

నిర్వచనములు.

2. (1) ఈ చట్టములో సందర్భము ఇతర విధముగా కోరిననే తప్ప,-

(ఎ) "ఏజెన్సీ" అనగా 3వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన జాతీయ దర్యాప్తు ఏజెన్సీ అని అర్థము;

(బి) "కోడ్" అనగా క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 (1974లోని 2వది) అని అర్థము;

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టము యొక్క 2వ పరిచ్ఛేదము ద్వారా, "మరియు" పదము వదిలివేయబడినది.
2. (2-08-2019 నుండి) అదే చట్టపు 2వ పరిచ్ఛేదము ద్వారా చొప్పించబడినది.

(సి) "ఉన్నత న్యాయస్థానము" అనగా ఏ ఉన్నత న్యాయస్థానపు అధికారితా పరిధిలో ప్రత్యేక న్యాయస్థానము ఉన్నదో అట్టి ఉన్నత న్యాయస్థానము అని అర్థము;

(డి) "విహితపరచబడిన" అనగా నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(ఇ) "పబ్లిక్ ప్రాసిక్యూటర్" అనగా 15వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేదా ఒక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేదా ఒక ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అని అర్థము;

(ఎఫ్) "అనుసూచి" అనగా ఈ చట్టమునకు గల అనుసూచి అని అర్థము;

(జి) "అనుసూచిత అపరాధము" అనగా అనుసూచిలో నిర్దిష్టపరచబడిన అపరాధము అని అర్థము;

(హెచ్) "ప్రత్యేక న్యాయస్థానము" అనగా 11వ పరిచ్ఛేదము లేదా సందర్భాన్నిబట్టి 22వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన [1][ప్రత్యేక న్యాయస్థానముగా పేర్కొనబడిన సెషన్ న్యాయస్థానము] అని అర్థము;

(ఐ) ఈ చట్టములో ఉపయోగించబడి, నిర్వచించబడని మరియు కోడ్‌లో నిర్వచించబడిన పదములు మరియు పదబంధములు, కోడ్‌లో వాటికి వరుసగా ఒసగబడిన అర్థములనే కలిగియుండవలెను.

(2) ఏదేని శాసనము లేదా దానికి చెందిన ఏదేని నిబంధనకు ఈ చట్టములోని ఏదేని నిర్దేశము, అట్టి శాసనము లేదా అట్టి నిబంధన అమలులో లేని ఒక ప్రాంతమునకు సంబంధించి అట్టి ప్రాంతములో అమలులో ఉన్నట్టి తత్సమానమైన శాసనము లేదా అట్టి తత్సమానమైన శాసనములోని సంబంధిత నిబంధన ఏదేని ఉన్నట్లయితే దానికి నిర్దేశముగా అన్వయించుకొనవలెను.

## అధ్యాయము-II

## జాతీయ దర్యాప్తు ఏజెన్సీ

3. (1) పోలీసు చట్టము, 1861 (1861లోని 5వది)లో ఏమి ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వము అనుసూచిలో నిర్దిష్టపరచిన చట్టముల క్రింద అపరాధముల దర్యాప్తు మరియు ప్రాసిక్యూషను కొరకు జాతీయ దర్యాప్తు ఏజెన్సీ అని పేర్కొనబడు ఒక ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేయవచ్చును. జాతీయ దర్యాప్తు ఏజెన్సీ ఏర్పాటు.

(2) ఇందు కోసం కేంద్ర ప్రభుత్వము చేయు ఏవేని ఉత్తరువులకు అధ్యధీనమై ఏజెన్సీ అధికారులు అనుసూచిత అపరాధములను దర్యాప్తు చేయుటకు మరియు అట్టి అపరాధములలో సంబంధిత వ్యక్తులను అరెస్టు చేయుటకు సంబంధించి [2][మరియు భారతదేశము వెలుపల ఏదేని అంతర్జాతీయ సంధి లేదా సంబంధిత దేశము యొక్క ఆంతరంగిక శాసనమునకు అధ్యధీనమై] అట్లు చేసిన అపరాధములను దర్యాప్తు చేయు సందర్భంలో పోలీసు అధికారులు కలిగివున్నట్టి అన్ని అధికారములు, కర్తవ్యములు, ప్రత్యేక హక్కులు మరియు దాయిత్వములను భారతదేశ వ్యాప్తముగా కలిగియుండవలెను.

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టము యొక్క 3వ పరిచ్ఛేదము ద్వారా, "ఏర్పాటు చేయబడిన ప్రత్యేక న్యాయస్థానము"నకు బదులుగా ఉంచబడినది.
2. (2-08-2019 నుండి) అదే చట్టపు 4వ పరిచ్ఛేదము ద్వారా చొప్పించబడినది.

(3) సబ్-ఇన్‌స్పెక్టరు లేదా అంతకంటే పై హోదా కలిగిన ఎవరేని ఏజెన్సీ అధికారి ఇందు కోసం కేంద్ర ప్రభుత్వము చేయు ఏవేని ఉత్తరువులకు అధ్యధీనమై, ప్రస్తుతానికి అతను ఉన్న ప్రాంతంలోని పోలీసు స్టేషను ఇన్‌ఛార్జీ అధికారి యొక్క ఏవేని అధికారములను భారతదేశ వ్యాప్తముగా వినియోగించవచ్చును మరియు అట్టి అధికారములను వినియోగించునపుడు పైన పేర్కొనిన ఏవేని అట్టి ఉత్తరువులకు అధ్యధీనమై అట్టి అధికారములను, అతని స్టేషను పరిధుల లోపల అట్టి ఒక అధికారి యొక్క కృత్యములను నెరవేర్చుచున్న ఒక పోలీసు స్టేషను ఇన్‌ఛార్జీ అధికారిగానే భావించవలెను.

జాతీయ దర్యాప్తు ఏజెన్సీ అధీక్షణ.

4. (1) ఏజెన్సీ అధీక్షణ కేంద్ర ప్రభుత్వములో నిహితమైయుండవలెను.

(2) ఏజెన్సీ పరిపాలన, కేంద్ర ప్రభుత్వము ఇందు కోసం నియమించిన డైరెక్టరు జనరలు హోదా కల్పించబడిన అధికారిలో నిహితమై ఉండును. ఏజెన్సీకు సంబంధించి అతను, ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వము నిర్దిష్టపరచునట్టి రాష్ట్రములోని పోలీసు దళమునకు సంబంధించి పోలీసు డైరెక్టరు జనరలు వినియోగించదగు అధికారములనే వినియోగించవలెను.

ఏజెన్సీ ఏర్పాటు రీతి మరియు సభ్యుల సేవా షరతులు.

5. ఈ చట్టములోని నిబంధనలకు అధ్యధీనమై విహితపరచబడునట్టి రీతిలో ఏజెన్సీ ఏర్పాటు చేయబడవలెను మరియు సంస్థలో నియమించబడిన వ్యక్తుల సేవా షరతులు విహితపరచబడునట్లుగా ఉండవలెను.

## అధ్యాయము-III

## జాతీయ దర్యాప్తు ఏజెన్సీచే దర్యాప్తు

అనుసూచిత అపరాధముల దర్యాప్తు.

6. (1) పోలీసు స్టేషను ఇన్‌ఛార్జీ అధికారి, ఏదేని అనుసూచిత అపరాధమునకు సంబంధించి సమాచారమును అందుకొని మరియు దానిని కోడ్‌లోని 154వ పరిచ్ఛేదము క్రింద నమోదు చేసిన మీదట దాని నివేదికను వెంటనే రాజ్య ప్రభుత్వమునకు పంపవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నివేదికను అందుకున్న మీదట, రాజ్య ప్రభుత్వము వీలైనంత త్వరగా దానిని కేంద్ర ప్రభుత్వమునకు పంపవలెను.

(3) రాజ్య ప్రభుత్వము నుండి నివేదిక అందిన మీదట, కేంద్ర ప్రభుత్వము, రాజ్య ప్రభుత్వము అందచేసిన లేదా ఇతర మార్గముల నుండి అందిన సమాచారముపై ఆధారపడి నివేదిక అందిన పదిహేను దినములలోగా అట్టి అపరాధము అనుసూచిత అపరాధము అవునా కాదా మరియు అపరాధ తీవ్రతను మరియు ఇతర సంబంధిత అంశములను దృష్టిలో ఉంచుకొని ఏజెన్సీ దర్యాప్తు చేయుటకు యోగ్యమైన కేసు అయి ఉన్నదా లేదా అన్న విషయమును నిర్ధారించవలెను.

(4) అపరాధము అనుసూచిత అపరాధమని మరియు ఏజెన్సీచే దర్యాప్తు చేయబడుటకు యోగ్యమైన కేసు అయి ఉన్నదని కేంద్ర ప్రభుత్వము భావించినపుడు సదరు అపరాధమును దర్యాప్తు చేయవలసినదిగా ఏజెన్సీని అది ఆదేశించవచ్చును.

(5) ఈ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికీ, ఈ చట్టము క్రింద దర్యాప్తు చేయవలసిన అవసరమున్నట్టి అనుసూచిత అపరాధము చేయబడినదని కేంద్ర ప్రభుత్వము భావించినచో సదరు అపరాధమును దర్యాప్తు చేయవలసినదిగా అది తనంతతానుగా ఏజెన్సీని ఆదేశించవచ్చును.

(6) ఉప-పరిచ్ఛేదము (4) లేదా ఉప-పరిచ్ఛేదము (5) క్రింద ఏదేని ఆదేశము జారీ చేయబడినపుడు, రాజ్య ప్రభుత్వము మరియు అపరాధమును దర్యాప్తు చేయుచున్న రాజ్య ప్రభుత్వమునకు చెందిన ఎవరేని పోలీసు అధికారి అట్టి దర్యాప్తును కొనసాగించరాదు మరియు సంబంధిత పత్రములు మరియు రికార్డులను వెంటనే ఏజెన్సీకి పంపించవలెను.

(7) సందేహములను తొలగించడానికై, ఏజెన్సీ కేసు దర్యాప్తును చేపట్టువరకు దర్యాప్తును కొనసాగించుట పోలీసు స్టేషను ఇన్‌ఛార్జీ అధికారి కర్తవ్యమైయుండవలెను.

[1][(8) ఈ చట్టము విస్తరించిన మేరకు భారతదేశము వెలుపలి ఏదేని స్థలములో అనుసూచిత అపరాధము చేసినట్లు కేంద్ర ప్రభుత్వము అభిప్రాయపడినచో, ఆ అపరాధము భారతదేశము లోపల చేసినట్లుగా ఆ ఏజెన్సీకి కేసును నమోదు మరియు దర్యాప్తు చేయుటకు ఆదేశము నీయవచ్చును.

(9) ఉప-పరిచ్ఛేదము (8) నిమిత్తము, ఢిల్లీలో ఉన్న ప్రత్యేక న్యాయస్థానము అధికారితాపరిధి కలిగి ఉండును.]

రాజ్య ప్రభుత్వమునకు దర్యాప్తును బదిలీచేయు అధికారము.

7. ఈ చట్టము క్రింద ఏదేని అపరాధమును దర్యాప్తు చేయుచున్నపుడు, అపరాధ తీవ్రతను మరియు ఇతర సంబంధిత అంశాలను దృష్టిలో ఉంచుకొను ఏజెన్సీ,-

(ఎ) అట్లు చేయుట ఆవశ్యకమైనచో దర్యాప్తుకు సహకరించమని రాజ్య ప్రభుత్వమును కోరవచ్చును; లేదా

(బి) కేంద్ర ప్రభుత్వ ముందస్తు ఆమోదముతో అపరాధమును దర్యాప్తుచేసి విచారించుటకై కేసును రాజ్య ప్రభుత్వమునకు బదిలీ చేయవచ్చును.

సంబంధిత అపరాధములను దర్యాప్తు చేయుటకు అధికారము.

8. ఏదేని అనుసూచిత అపరాధమును దర్యాప్తు చేయుచున్నపుడు అనుసూచిత అపరాధముతో సంబంధమున్నట్టి ఏదేని ఇతర అపరాధమును చేసినట్లుగా నిందితులు ఆరోపించబడినట్లయితే, అట్టి అపరాధమును కూడా ఏజెన్సీ దర్యాప్తు చేయవచ్చును.

జాతీయ దర్యాప్తు ఏజెన్సీకు రాజ్య ప్రభుత్వము సహాయమును అందించుట.

9. అనుసూచిత అపరాధములను దర్యాప్తు చేయుటకై ఏజెన్సీకు అన్ని సహాయ సహకారములను రాజ్య ప్రభుత్వము అందించవలెను.

అనుసూచిత అపరాధములను దర్యాప్తు చేయుటకై రాజ్య ప్రభుత్వ అధికారము.

10. ఈ చట్టములో ఇతర విధముగా నిబంధించిననే తప్ప, ఈ చట్టములో ఉన్నదేదీ, తత్కాలములో అమలులో ఉన్న ఏదేని శాసనము క్రింద ఏదేని అనుసూచిత అపరాధము లేదా ఇతర అపరాధములను దర్యాప్తుచేసి మరియు విచారణ చేయుటకై రాజ్య ప్రభుత్వ అధికారములకు భంగము కలిగించదు.

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టము యొక్క 5వ పరిచ్ఛేదము ద్వారా చొప్పించబడినది.

# అధ్యాయము–IV
# ప్రత్యేక న్యాయస్థానములు

ప్రత్యేక న్యాయస్థానములు[1][గా పేర్కొనబడిన సెషన్ న్యాయస్థానముకై] కేంద్ర ప్రభుత్వ అధికారము.

11. [2][(1) అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా కేంద్ర ప్రభుత్వము, ఉన్నత న్యాయస్థానము యొక్క ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన మీదట, అనుసూచిత అపరాధములను విచారించుట కొరకై] అధిసూచనలో నిర్దిష్టపరచబడినట్టి ప్రాంతము లేదా ప్రాంతముల కొరకు లేదా అట్టి కేసు లేదా కేసుల తరగతి లేదా సముదాయము కొరకు [2][ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సెషన్ న్యాయస్థానములను ప్రత్యేక న్యాయస్థానముగా పేర్కొనవలెను.]

[3]**[విశదీకరణ:** ఈ ఉప–పరిచ్ఛేదము నిమిత్తము, పదబంధము "ఉన్నత న్యాయస్థానము" అనగా ప్రత్యేక న్యాయస్థానముగా పేర్కొనబడుచున్న సెషన్ న్యాయస్థానము యొక్క కృత్యములను నిర్వర్తించుచున్న రాజ్యము యొక్క ఉన్నత న్యాయస్థానము అని అర్థము.**]**

(2) ఏదేని ప్రత్యేక న్యాయస్థానము యొక్క అధికారితాపరిధి విషయమై ఏదేని సందేహం ఉత్పన్నమైనపుడు దానిని కేంద్ర ప్రభుత్వమునకు పంపించవలెను. ఈ విషయములో దాని నిర్ణయం అంతిమమైనదైయుండును.

[4] * * * * * *

(8) సందేహముల నివృత్తి కొరకు, [5][ఉప–పరిచ్ఛేదము(1)లో నిర్దేశించిన సెషన్ న్యాయస్థానము యొక్క సెషన్స్ న్యాయాధీశుని ద్వారా] అతను ఏ సర్వీసుకు చెందియుండునో అట్టి సర్వీసులో అతనికి వర్తించదగు నియమముల క్రింద పదవీ విరమణ వయస్సు వచ్చువరకు [6][ప్రత్యేక న్యాయస్థానము యొక్క న్యాయాధీశునిగా] కొనసాగుటకు భంగము కలిగించరాదని ఇందుమూలముగా నిబంధించడమైనది మరియు [6][కేంద్ర ప్రభుత్వమును సంప్రదించిన మీదట నియామక ప్రాధికారి] ఉత్తరువు ద్వారా ఒక నిర్ధిష్ట తేదీ వరకు లేదా అతని సమక్షమున ఉన్నట్టి కేసు లేదా కేసుల విచారణ పూర్తి అయ్యేవరకు [7][, ఏది ముందైతే అది] న్యాయాధీశునిగా కొనసాగవలెనని ఆదేశించవచ్చును.

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా "ఏర్పాటు చేయుట" బదులుగా ఉంచబడినది.
2. (2-08-2019 నుండి) అదే చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా "కేంద్ర ప్రభుత్వము అనుసూచిత అపరాధములను విచారించుట కొరకై అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ న్యాయస్థానములను ఏర్పాటు చేయవలెను"కు బదులుగా ఉంచబడినది.
3. (2-08-2019 నుండి) అదే చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా చొప్పించబడినది.
4. (2-08-2019 నుండి) అదే చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా ఉప–పరిచ్ఛేదములు (3),(4),(5),(6) మరియు (7) వదిలివేయబడినవి.
5. (2-08-2019 నుండి) అదే చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా "ప్రత్యేక న్యాయస్థానము యొక్క న్యాయాధీశునిగా లేదా అదనపు న్యాయాధీశునిగా నియమించబడిన వ్యక్తి"కు బదులుగా ఉంచబడినది.
6. (2-08-2019 నుండి) అదే చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా "అట్టి న్యాయాధీశుడు లేదా అదనపు న్యాయాధీశుడు మరియు కేంద్ర ప్రభుత్వము"కు బదులుగా ఉంచబడినది.
7. (2-08-2019 నుండి) అదే చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా "అట్టి ఉత్తరువులో నిర్ధిష్టపరచబడిన విధముగా"కు బదులుగా ఉంచబడినది.

[1][(9) ఒక ప్రాంతము లేదా ప్రాంతముల కొరకు ఒకటి కంటే ఎక్కువ ప్రత్యేక న్యాయస్థానములను పేర్కొనబడినప్పుడు, అందరికంటే సీనియరు అయిన న్యాయాధీశుడు వాటి మధ్య కార్యకలాపములను పంపకము చేయవలెను.]

సమావేశ ప్రదేశము.

12. ప్రత్యేక న్యాయస్థానము తన శాసనిక చర్యల కొరకు స్వయం ప్రేరణతో లేదా పబ్లిక్ ప్రాసిక్యూటర్ దరఖాస్తుపైన మరియు అట్లు చేయుట ఆవశ్యకమని లేదా వాంఛనీయమని అది భావించినచో దాని సాధారణ సమావేశ ప్రదేశము కాకుండా ఏదేని ప్రదేశములో సమావేశము కావచ్చును.

ప్రత్యేక న్యాయస్థానముల అధికారితా పరిధి.

13. (1) కోడ్‌లో ఏమి ఉన్నప్పటికీ, ఏజెన్సీచే దర్యాప్తు చేయబడిన ప్రతియొక అనుసూచిత అపరాధమును అది ఏ ప్రత్యేక న్యాయస్థానపు స్థానిక అధికారితా పరిధిలో జరిగినదో అట్టి ప్రత్యేక న్యాయస్థానము మాత్రమే దానిని విచారించవలెను.

(2) అయితే, రాజ్యములో ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఆవశ్యకతలను దృష్టిలో ఉంచుకొని,-

(ఎ) న్యాయమైన, నిష్పాక్షికమైన లేదా సత్వర విచారణకు సాధ్యపడనట్లయితే; లేదా

(బి) శాంతికి భంగము వాటిల్లకుండా లేదా నిందితులు, సాక్షులు, పబ్లిక్ ప్రాసిక్యూటరు లేదా ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి లేదా వారిలో ఎవరి భద్రతకైనా తీవ్ర అపాయము సంభవించకుండా విచారణ జరుపుటకు సాధ్యపడనట్లయితే; లేదా

(సి) అది ఇతర విధముగా న్యాయ హితములో లేనట్లయితే, ప్రత్యేక న్యాయస్థానములో పెండింగుగా ఉన్న ఏదేని కేసును రాజ్యములోని లేదా ఏదేని ఇతర రాజ్యములోని ఏదేని ప్రత్యేక న్యాయస్థానమునకు సర్వోన్నత న్యాయస్థానము బదిలీ చేయవచ్చును మరియు ఆ రాజ్యములో ఉన్నట్టి ప్రత్యేక న్యాయస్థానములో పెండింగుగా ఉన్న ఏదేని కేసును రాజ్యములోని ఏదేని ఇతర ప్రత్యేక న్యాయస్థానమునకు ఉన్నత న్యాయస్థానము బదిలీ చేయవచ్చును.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద సర్వోన్నత న్యాయస్థానము లేదా సందర్భాన్నిబట్టి ఉన్నత న్యాయస్థానము, కేంద్ర ప్రభుత్వము లేదా ఆసక్తి గల పక్షం చేసిన దరఖాస్తుపై వ్యవహరించవచ్చును మరియు ఏదేని అట్టి దరఖాస్తు ప్రతిపాదన ద్వారా చేయవలెను. భారత అటార్నీ జనరలు దరఖాస్తుదారుగా ఉన్నపుడు తప్ప ఒక ప్రమాణపత్రం లేదా ధ్రువీకరణ పత్రాన్ని దానికి జతపరచవలెను.

ఇతర అపరాధములకు సంబంధించి ప్రత్యేక న్యాయస్థానముల అధికారములు.

14. (1) ఏదేని అపరాధమును విచారించునపుడు ప్రత్యేక న్యాయస్థానము, అట్టి అపరాధము ఏదేని ఇతర అపరాధముతో సంబంధం కలిగివున్నచో, కోడ్ క్రింద నేరము ఆరోపించబడు నిందితులతో అట్టి ఇతర అపరాధమును కూడా అదే విచారణ సమయములో విచారించవచ్చును.

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టపు 6వ పరిచ్ఛేదము ద్వారా ఉప-పరిచ్ఛేదము (9)కు బదులుగా ఉంచబడినది.

(2) ఈ చట్టము క్రింద ఏదేని అపరాధము యొక్క విచారణా క్రమంలో ఈ చట్టము క్రింద లేదా ఏదేని ఇతర శాసనము క్రింద నిందిత వ్యక్తి ఏదేని ఇతర అపరాధము చేసినట్లుగా కనుగొనబడినచో ప్రత్యేక న్యాయస్థానము అట్టి ఇతర అపరాధమునకు చెందిన అట్టి వ్యక్తిని దోషస్థాపన చేయవచ్చును మరియు ఈ చట్టము ద్వారా లేదా సందర్భాన్నిబట్టి అట్టి ఇతర శాసనము క్రింద అధికారమీయబడిన శిక్ష విధించవచ్చును లేదా శిక్ష వేయవచ్చును.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లు.

15. (1) కేంద్ర ప్రభుత్వము, పబ్లిక్ ప్రాసిక్యూటరుగా ఒక వ్యక్తిని నియమించవచ్చును మరియు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటరు లేదా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ఒకరు లేక అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులను నియమించవచ్చును:

అయితే, కేంద్ర ప్రభుత్వము ఏదేని కేసు లేదా కేసుల వర్గం లేదా గ్రూపునకు ఒక ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరును కూడా నియమించవచ్చును.

(2) ఒక వ్యక్తి, ఏడు సంవత్సరములకు తక్కువ కాకుండా న్యాయవాదిగా ప్రాక్టీసులో ఉండిననే తప్ప లేదా న్యాయశాస్త్రములో ప్రత్యేక పరిజ్ఞానము అవసరమయ్యే కేంద్ర లేదా రాజ్య ప్రభుత్వములో ఏదేని పదవిని ఏడు సంవత్సరముల కంటే తక్కువకాని కాలావధికి వహించిననే తప్ప, ఈ పరిచ్ఛేదము క్రింద పబ్లిక్ ప్రాసిక్యూటరు లేదా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటరు లేదా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించబడుటకు అర్హులై ఉండరు.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద పబ్లిక్ ప్రాసిక్యూటరుగా లేదా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటరుగా లేదా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరుగా నియమించబడిన ప్రతియొక వ్యక్తి, కోడ్‌లోని 2వ పరిచ్ఛేదపు ఖండము (యు) అర్థములో ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటరుగా భావించబడవలెను మరియు కోడ్‌లోని నిబంధనలు ఆ ప్రకారంగా అమలులోనికి వచ్చును.

ప్రత్యేక న్యాయస్థానముల ప్రక్రియ మరియు అధికారములు.

16. (1) ప్రత్యేక న్యాయస్థానము, అట్టి అపరాధమును ఏర్పరచు అంశముల ఫిర్యాదు అందిన మీదట లేదా అట్టి అంశముల పోలీసు నివేదిక అందిన మీదట, నిందితులు విచారణ కొరకు దానికి పంపబడకుండా ఏదేని అపరాధమును సంజ్ఞేయము చేయవచ్చును.

(2) ప్రత్యేక న్యాయస్థానముచే విచారణ చేయబడదగు అపరాధము మూడు సంవత్సరములకు మించని కారావాసము లేదా జరిమానా లేదా రెండింటితో శిక్షింపబడదగినదిగా ఉన్నపుడు, ప్రత్యేక న్యాయస్థానము, కోడ్‌లోని 260వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (1) లేదా 262వ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికీ, కోడ్‌లో విహితపరచబడిన ప్రక్రియ ననుసరించి ఒక సంక్షిప్త విధానములో విచారణ చేయవచ్చును మరియు కోడ్ యొక్క 263 నుండి 265 పరిచ్ఛేదములలోని నిబంధనలను యథాశక్యముగా అట్టి విచారణకు వర్తింపచేయవలెను:

అయితే, ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద సంక్షిప్త విచారణ క్రమంలో, కేసు స్వభావము, సంక్షిప్త విధానంలో దానిని విచారణ చేయుటకు అది వాంఛనీయమైనది కాదని ప్రత్యేక న్యాయస్థానము భావించినపుడు, పరీక్షింపబడదగునట్టి సాక్షులను ప్రత్యేక న్యాయస్థానము వెనుకకు ఉపసంహరించవలెను మరియు అట్టి అపరాధము యొక్క విచారణ కొరకు కోడ్‌లోని నిబంధనల ద్వారా వీలు కల్పించబడిన రీతిలో కేసును తిరిగి విచారించుటకు ఉపక్రమించవలెను మరియు సదరు నిబంధనలను మేజిస్ట్రేటుకు సంబంధించి వర్తింపచేసినట్లుగానే వాటిని ప్రత్యేక న్యాయస్థానమునకు సంబంధించి వర్తింపచేయవలెను:

అంతేకాకుండా, ఈ పరిచ్ఛేదము క్రింద సంక్షిప్త విచారణలో ఏదేని దోషస్థాపన విషయములో ప్రత్యేక న్యాయస్థానము ఒక సంవత్సరమునకు మించని కారావాస శిక్ష మరియు ఐదు లక్షల రూపాయల వరకు విస్తరించదగు జరిమానాతో శిక్ష విధించుట న్యాయసమ్మతం అవుతుంది.

(3) ఈ చట్టములోని ఇతర నిబంధనలకు అధ్యధీనమై, ఏదేని అపరాధపు విచారణ నిమిత్తం ప్రత్యేక న్యాయస్థానము, సెషన్స్ న్యాయస్థానము యొక్క అధికారములన్నింటినీ కలిగి ఉండవలెను మరియు అట్టి అపరాధమును ఒక సెషన్స్ న్యాయస్థానము సమక్షములో విచారణ కొరకు కోడ్‌లో విహితపరచిన ప్రక్రియ ననుసరించి, అయినంతవరకు అది సెషన్స్ న్యాయస్థానముగానే భావించి అట్టి అపరాధమును విచారణ చేయవలెను.

(4) ఈ చట్టములోని ఇతర నిబంధనలకు అధ్యధీనమై 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రత్యేక న్యాయస్థానమునకు బదిలీ చేయబడిన ప్రతియొక కేసు, అట్టి ప్రత్యేక న్యాయస్థానమునకు కోడ్‌లోని 406వ పరిచ్ఛేదము క్రింద బదిలీ చేయబడినట్టి కేసుగానే భావించి వ్యవహరించవలెను.

(5) కోడ్‌లో ఏమి ఉన్నప్పటికీ, కోడ్‌లోని 299వ పరిచ్ఛేదపు నిబంధనలకు అధ్యధీనమై ప్రత్యేక న్యాయస్థానము, దానిచే రికార్డు చేయబడు కారణముల వలన సముచితమని భావించినచో నిందితుడు లేదా అతని న్యాయవాది హాజరుగా లేనపుడు విచారణకు ఉపక్రమించవచ్చును మరియు క్రాసు పరీక్ష కొరకు సాక్షిని వెనుకకు రప్పించుటకై నిందితుని హక్కుకు అధ్యధీనమై ఎవరేని సాక్షి యొక్క సాక్ష్యమును రికార్డు చేయవచ్చును.

17. (1) కోడ్‌లో ఏమి ఉన్నప్పటికీ, వ్రాతపూర్వకముగా రికార్డు చేయబడు కారణముల వలన ప్రత్యేక న్యాయస్థానము ఆ విధముగా వాంఛించినచో ఈ చట్టము క్రింద శాసనిక చర్యలను రహస్యముగా నిర్వహించవచ్చును. సాక్ష్యుల రక్షణ.

(2) ప్రత్యేక న్యాయస్థానము, తన సమక్షములోని ఏదేని శాసనిక చర్యలో సాక్షి లేదా అట్టి సాక్షికి సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటరు దాఖలు చేసిన దరఖాస్తుపై లేదా దాని స్వయం ప్రేరణపై అట్టి సాక్షికి ప్రాణాపాయము ఉన్నదని అది సంతృప్తిచెందినచో వ్రాతపూర్వకముగా రికార్డు చేయబడు కారణముల ద్వారా అట్టి సాక్షి గుర్తింపు మరియు చిరునామాను రహస్యంగా ఉంచడానికై అది ఉచితమని భావించినట్టి చర్యలను తీసుకొనవచ్చును.

(3) ప్రత్యేకించియు మరియు ఉప-పరిచ్ఛేదము (2)లోని నిబంధనల సాధారణ వ్యాపకతకు భంగము వాటిల్లకుండా సదరు ఉప-పరిచ్ఛేదము క్రింద ప్రత్యేక న్యాయస్థానము తీసుకొనే చర్యలతో-

(ఎ) ప్రత్యేక న్యాయస్థానముచే నిర్ణయించబడు ప్రదేశంలో శాసనిక చర్యలను నిర్వహించుట;

(బి) దాని ఉత్తరువులు లేదా తీర్పులు లేదా ప్రజలకు అందుబాటులో ఉన్న ఏవేని కేసు రికార్డులలో సాక్షుల పేర్లు మరియు చిరునామాలను పేర్కొనడాన్ని నివారించుట;

(సి) సాక్షుల గుర్తింపు మరియు చిరునామాలను వెల్లడి చేయలేదని నిర్ధారించుట కొరకు ఏవేని ఆదేశములను జారీచేయుట; మరియు

(డి) ప్రజా ప్రయోజనము దృష్ట్యా అట్టి న్యాయస్థానములో పెండింగు ఉన్నట్టి అన్ని లేక ఏవేని శాసనిక చర్యలను ఏ విధముగానూ ప్రచురించరాదని ఉత్తరువు చేయుటకు నిర్ణయము తీసుకొనుట వంటివి ఉండవచ్చును.

(4) ఉప-పరిచ్ఛేదము (3) క్రింద జారీచేసిన ఏదేని నిర్ణయము లేక ఆదేశమును ఉల్లంఘించునట్టి ఎవరేని వ్యక్తి మూడు సంవత్సరముల కాలావధికి విస్తరించదగు కారావాసము మరియు ఒక వెయ్యి రూపాయలకు విస్తరించదగు జరిమానాతోనూ శిక్షింపబడవలెను.

అభియోగం నడుపుట కొరకు మంజూరు.

18. ఈ చట్టము ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుటలో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనికైనా సంబంధించి కేంద్ర ప్రభుత్వము ముందుగా మంజూరు ఇచ్చిననే తప్ప ఏజెన్సీకి చెందిన ఎవరేని సభ్యుడు లేదా అతని తరపున వ్యవహరించే ఎవరేని వ్యక్తిపై ఏ న్యాయస్థానములోను ఎట్టి అభియోగం నడుపుటకును, దావా లేదా ఇతర శాసనిక చర్యలను దాఖలు చేయరాదు.

ప్రాధాన్యతను కలిగి ఉండుటకై ప్రత్యేక న్యాయస్థానములచే విచారణ

19. ఈ చట్టము క్రింద ప్రత్యేక న్యాయస్థానము ఏదేని అపరాధపు విచారణను రోజువారీ ప్రాతిపదికపై అన్ని పని దినములలో జరుపవలెను మరియు ఏదేని ఇతర న్యాయస్థానములో (ప్రత్యేక న్యాయస్థానము కానిది) నిందితునిపై ఏదేని ఇతర కేసు యొక్క విచారణపై ప్రాధాన్యతను కలిగివుండవలెను మరియు అట్టి ఇతర కేసు విచారణకు ప్రాధాన్యంతో ముగించవలెను మరియు ఆ ప్రకారముగా అట్టి ఇతర కేసు విచారణ, అవసరమైనచో ఎటూ తేల్చని స్థితిలో ఉంచవలెను.

నియతక్రమమైన న్యాయస్థానములకు కేసులను బదిలీ చేయుటకు అధికారము.

20. ఏదేని అపరాధమును సంజ్ఞేయము చేసిన తరువాత ప్రత్యేక న్యాయస్థానము తనచే అట్టి అపరాధము విచారణ చేయదగినది కాదని భావించినపుడు, అట్టి అపరాధమును విచారణ చేయుటకు దానికి అధికారితా పరిధి లేనప్పటికీ, సదరు కేసును కోడ్ క్రింద విచారణ చేయుటకు అధికారితా పరిధిని కలిగివున్నట్టి ఏదేని న్యాయస్థానమునకు బదిలీ చేయవలెను మరియు సదరు కేసు బదిలీ చేయబడిన న్యాయస్థానము సదరు అపరాధమును తానే సంజ్ఞేయము చేసినట్లుగా భావించి విచారణకు ఉపక్రమించవలెను.

అపీళ్లు.

21. (1) కోడ్‌లో ఏమున్నప్పటికీ, ప్రత్యేక న్యాయస్థానము యొక్క ఏదేని తీర్పు, దండన లేదా ఉత్తరువు లేదా వ్యాజ్యకాలీన ఉత్తరువు కాని ఉత్తరువు నుండి అంశములు మరియు శాసనము రెండింటిపై ఉన్నత న్యాయస్థానమునకు అపీలు చేయవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రతియొక అపీలును ఉన్నత న్యాయస్థానమునకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు గల న్యాయ పీఠము (బెంచ్) విచారణ జరుపవలెను మరియు వీలయినంత వరకు అపీలును అనుమతించిన తేదీ నుండి మూడు మాసముల కాలావధిలోగా పరిష్కరించవలెను.

(3) పైన పేర్కొన్న విధముగా తప్ప ప్రత్యేక న్యాయస్థానము యొక్క ఏదేని తీర్పు, దండన ఉత్తరువు లేదా వ్యాజ్యకాలీన ఉత్తరువుతో సహా ఏదేని ఉత్తరువు నుండి ఏదేని న్యాయస్థానమునకు ఎట్టి అపీలు లేదా రివిజను దాఖలు చేయరాదు.

(4) కోడ్‌లోని 378వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లో ఏమి ఉన్నప్పటికీ, బెయిలు మంజూరు చేయుచున్న లేక తిరస్కరిస్తున్న ప్రత్యేక న్యాయస్థానము ఉత్తరువుపై ఉన్నత న్యాయస్థానమునకు అపీలు చేయవలెను.

(5) ఈ పరిచ్ఛేదము క్రింద ప్రతియొక అపీలును, అపీలు కోరబడిన తీర్పు, దండన ఉత్తరువు లేదా ఉత్తరువు తేదీ నుండి ముప్పది దినముల కాలావధిలోగా దాఖలు చేయవలెను:

అయితే, ముప్పది దినముల కాలావధిలోగా అపీలు దాఖలు చేయకపోవుటకు అపీలుదారుకు తగిన కారణమున్నదని ఉన్నత న్యాయస్థానము సంతృప్తిచెందినచో సదరు ముప్పది దినముల కాలావధి ముగిసిన తరువాత అది అపీలును స్వీకరించవచ్చును:

అంతేకాకుండా, తొంబది దినముల కాలావధి ముగిసిన తరువాత ఎట్టి అపీలును స్వీకరించరాదు.

ప్రత్యేక న్యాయస్థానములు [1][గా పేర్కొనబడిన సెషన్ న్యాయస్థానముకై] రాజ్య ప్రభుత్వ అధికారము.

22. (1) రాజ్య ప్రభుత్వము, అనుసూచిలో నిర్దిష్టపరచిన ఏదేని లేదా అన్ని చట్టముల క్రింద అపరాధముల విచారణ కొరకు [2][ప్రత్యేక న్యాయస్థానములుగా ఒకటి లేక అంతకంటే ఎక్కువ సెషన్ న్యాయస్థానములను పేర్కొనవచ్చును.]

(2) ఈ అధ్యాయములోని నిబంధనలు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రాజ్య ప్రభుత్వముచే [3][పేర్కొనబడిన] ప్రత్యేక న్యాయస్థానములకు వర్తింపచేయవలెను మరియు ఈ క్రింది మార్పులకు అధ్యధీనమై అమలుకలిగియుండును, అవేవనగా-

(i) 11వ మరియు 15వ పరిచ్ఛేదములలో "కేంద్ర ప్రభుత్వము"నకు చేసిన నిర్దేశములను రాజ్య ప్రభుత్వమునకు చేసిన నిర్దేశములుగానే అన్వయించుకొనవలెను;

(ii) 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లో "ఏజెన్సీ"కి చేసిన నిర్దేశమును "రాజ్య ప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీ"కి చేసిన నిర్దేశముగానే అన్వయించుకొనవలెను;

(iii) 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లోని భారత అటార్నీ జనరలుకు చేసిన నిర్దేశమును "రాజ్య ప్రభుత్వ అడ్వకేటు జనరలుకు" చేసిన నిర్దేశముగానే అన్వయించుకొనవలెను.

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టము యొక్క 7వ పరిచ్ఛేదము ద్వారా "ఏర్పాటు చేయుట"కు బదులుగా ఉంచబడినది.
2. (2-08-2019 నుండి) అదే చట్టపు 7వ పరిచ్ఛేదము ద్వారా "ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఏర్పాటు చేయుట"కు బదులుగా ఉంచబడినది.
3. (2-08-2019 నుండి) అదే చట్టపు 7వ పరిచ్ఛేదము ద్వారా "ఏర్పాటు చేయబడిన"కు బదులుగా ఉంచబడినది.

(3) ఒక ప్రత్యేక న్యాయస్థానముపై ఈ చట్టము ద్వారా సంక్రమించిన అధికారితా పరిధి, కోడ్‌లో ఏమున్నప్పటికీ ఈ చట్టము క్రింద శిక్షింపదగు ఏదేని అపరాధము విషయములో ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రాజ్య ప్రభుత్వముచే ప్రత్యేక న్యాయస్థానము [1][పేర్కొనబడు] వరకు అట్టి అపరాధము జరిగిన డివిజను యొక్క సెషన్ న్యాయస్థానముచే వినియోగించబడవలెను.

(4) రాజ్య ప్రభుత్వముచే ప్రత్యేక న్యాయస్థానము ఏర్పాటు చేయబడిన తేదీన మరియు అట్టి తేదీ నుండి ఈ చట్టములోని నిబంధనల క్రింద రాజ్య ప్రభుత్వముచే దర్యాప్తు చేయబడిన ఏదేని అపరాధమునకు చెందిన మరియు ప్రత్యేక న్యాయస్థానములో నిర్వహించవలసి ఉండియుండెడి విచారణ, అట్టి న్యాయస్థానము [1][పేర్కొనబడిన] తేదీన దానికి బదిలీ చేయబడవలెను.

## అధ్యాయము-V

## వివిధ విషయములు

నియమములు చేయుటకు ఉన్నత న్యాయస్థానములకు అధికారము.

23. ఉన్నత న్యాయస్థానము తన అధికారితా పరిధిలోని ప్రత్యేక న్యాయస్థానములకు సంబంధించి ఈ చట్టములోని నిబంధనలను అమలు జరుపుటకై అది అవసరమని భావించునట్టి నియమములను అధికారిక రాజపత్రము ద్వారా చేయవచ్చును.

ఇబ్బందులను తొలగించుటకు అధికారము.

24. (1) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటలో ఏదేని ఇబ్బంది ఉత్పన్నమయినచో, కేంద్ర ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో ప్రచురించిన ఉత్తరువు ద్వారా ఆ ఇబ్బందిని తొలగించుటకు అవసరమని లేదా ఉపయుక్తమని తాను భావించినట్టి ఈ చట్టపు నిబంధనలకు అసంగతముకాని నిబంధనలను చేయవచ్చును:

అయితే, ఈ చట్టము ప్రారంభమైన నాటి నుండి రెండు సంవత్సరములు ముగిసిన తరువాత ఈ పరిచ్ఛేదము క్రింద అట్టి ఉత్తరువు ఏదియు చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతియొక ఉత్తరువు అది చేయబడిన వెనువెంటనే పార్లమెంటు ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను.

నియమములను చేయుటకు అధికారము.

25. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టములోని నిబంధనలను అమలుపరచుటకై అధికారితా రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకించి మరియు పై అధికారము యొక్క వ్యాపకతకు భంగము కలుగకుండా ఈ క్రింది అన్నీ లేక ఏవేని విషయముల కొరకు అట్టి నియమములను చేయవచ్చును, అవేవనగా:-

(ఎ) 5వ పరిచ్ఛేదము క్రింద ఏజెన్సీని ఏర్పాటు చేయు రీతి మరియు ఏజెన్సీలో నియమించబడిన వ్యక్తుల సేవా షరతులు;

(బి) విహితపరచబడు అవసరమున్నట్టి లేదా విహితపరచబడునట్టి ఏదేని ఇతర విషయము.

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టపు 7వ పరిచ్ఛేదము ద్వారా "ఏర్పాటు చేయబడిన"కు బదులుగా ఉంచబడినది.

నియమములను ఉంచుట.

26. ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన ప్రతియొక నియమము అది చేయబడిన వెంటనే పార్లమెంటు అధివేశనములో ఉన్నపుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. అట్టి కాలావధి ఒకే అధివేశనములో గాని, వరుసగా వచ్చు రెండు లేక అంతకంటే ఎక్కువ అధివేశనములలో గాని చేరివుండవచ్చును. పైన చెప్పిన అధివేశనమునకు లేదా వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు ముందుగా ఉభయ సదనములు ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు అంగీకరించినచో లేక అట్టి నియమము చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినచో అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్పు చేయబడిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందర్భానుసారముగా ఎట్టి ప్రభావమును కలిగియుండదు; అయినప్పటికినీ అట్టి మార్పు లేక రద్దు అంతకు పూర్వము ఆ నియమము క్రింద చేసి ఉండిన దేని శాసనమాన్యతకైననూ భంగము కలిగించదు.

## అనుసూచి

## [2(1)(ఎఫ్) పరిచ్ఛేదము చూడుము]

[1][1. ప్రేలుడు పదార్థముల చట్టము, 1908 (1908లోని 6వది);

1ఏ. అణుశక్తి చట్టము, 1962 (1962లోని 33వది);]

2. చట్ట విరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టము, 1967 (1967లోని 37వది);

3. విమాన అపహరణ వ్యతిరేక చట్టము, [2][2016 (2016లోని 30వది)];

4. పౌర విమానయాన భద్రతపై చట్ట విరుద్ధ చర్యల అణచివేత చట్టము, 1982 (1982లోని 66వది);

5. సార్క్ సమ్మేళన (ఉగ్రవాద అణచివేత) చట్టము, 1993 (1993లోని 36వది);

6. సముద్ర నౌకాయాన భద్రతపై చట్ట విరుద్ధ చర్యల అణచివేత మరియు మహాద్వీప విధానంపై నిర్ధారిత వేదికల చట్టము, 2002 (2002లోని 69వది);

7. సామూహిక ప్రజా విధ్వంసక ఆయుధాల మరియు వాటి అప్పగింత విధానముల (చట్ట విరుద్ధ కార్యకలాపాల నిషిద్ధ) చట్టము, 2005 (2005లోని 21వది);

8. ఈ క్రింది వాటి క్రింద అపరాధములు-

   (ఎ) భారత శిక్షాస్మృతి (1860లోని 45వది)లోని VIవ అధ్యాయపు 121 నుండి 130 (రెండూ కలుపుకొని) పరిచ్ఛేదములు;

   [3][(బి) భారత శిక్షాస్మృతి (1860లోని 45వది)లోని XVIవ అధ్యాయపు 370 మరియు 370ఏ పరిచ్ఛేదములు;

   (సి) భారత శిక్షాస్మృతి (1860లోని 45వది)లోని 489-ఏ నుండి 489-ఈ (రెండూ కలుపుకొని) పరిచ్ఛేదములు;

   (డి) ఆయుధముల చట్టము, 1959 (1959లోని 54వది)లోని Vవ అధ్యాయములోని పరిచ్ఛేదము 25 యొక్క ఉప-పరిచ్ఛేదము (1ఏఏ);

   (ఇ) సమాచార సాంకేతిక చట్టము, 2000 (2000లోని 21వది) యొక్క XIవ అధ్యాయములోని పరిచ్ఛేదము 66ఎఫ్;]

---

1. (2-08-2019 నుండి) 2019లోని 16వ చట్టము యొక్క 8వ పరిచ్ఛేదము ద్వారా క్రమ సంఖ్య 1కు బదులుగా ఉంచబడినది.
2. (2-08-2019 నుండి) అదే చట్టపు 8వ పరిచ్ఛేదము ద్వారా "1982 (1982లోని 65వది)"కు బదులుగా ఉంచబడినది.
3. (2-08-2019 నుండి) అదే చట్టపు 8వ పరిచ్ఛేదము ద్వారా చొప్పించబడినది.